

అక్కన్నపేట: బోదర్‌వాగుతండాలో ఎండిన వరి పొలంలో మేకలు మేపుతున్న కాపరి

నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

11 హైదరాబాద్, బుధవారం 21 ఫిబ్రవరి 2024 SANGAREDDY

# అమాత్యులారా.. ఆలకించరా!

- కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటినా... సిద్దిపేట, మెదక్ జిల్లాల సమీక్షా సమావేశాల ఊసేలేదు..
- గ్రామాల్లో ముంచుకొస్తున్న తాగునీటి సమస్య
- సాగునీరు అందక ఎండుతున్న పంటలు
- రైతులకు మొదలైన కరెంట్ కష్టాలు
- రైతుబంధుకు అన్నదాతల ఎదురుచూపులు
- ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలపై సన్నద్ధత ఏదీ?
- బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన నిధులు వెనక్కి.. కుంటుపడిన అభివృద్ధి

## అభివృద్ధి, సంక్షేమం, సమస్యలు పట్టవా?



అక్కన్నపేట: నందారంలో క్రేన్ సహాయంతో వ్యవసాయ బావి తవ్వుతున్న రైతులు

సిద్దిపేట, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి): జిల్లా అభివృద్ధి, సంక్షేమం మంత్రులకు పట్టదా..? కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటుతున్నా కనీసం జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై జిల్లా స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించలేదు. జిల్లాలో ఏం జరుగుతున్నది.? సమస్యలు ఏం ఉన్నాయి...? వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగు, సాగునీటి పరిస్థితి ఏమిటి? రైతుబంధు ఎంతమందికి వచ్చింది? ఇంటర్, పదోతరగతి పరీక్షల నిర్వహణ, కరెంట్ సరఫరా తీరు.. ఇలా ఎన్నో అంశాలపై రివ్యూ మీటింగ్‌లు నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేయాల్సిన మంత్రులు ముఖం చాటేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పనులకు మంజూరు చేసిన నిధులు వెనక్కిపోవడంతో పనులు మధ్యలో ఆగిపోయాయి. వాటి పరిస్థితి ఏమిటి..? ఇవన్నింటినీ ఎలా పరిష్కరించాలి..? కనీసం జిల్లా అధికార యంత్రాంగానికి మంత్రుల సూచనలు కూడా లేవు. అసలు ప్రభుత్వం ఉందా..? పాలన నడుస్తున్నదా..? అనే విధంగా జిల్లాలో నిర్లిప్తత నెలకొంది. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి కొంతమేర దిశానిర్దేశం చేస్తున్నారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల సమీక్షా సమావేశాలు నిర్వహించడం లేదు. సిద్దిపేట జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ఎంతసేపు ఆయన కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలకే పరిమితమవుతున్నారనే అపవాదు





ఉంది. మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఒక్కసారి సిద్దిపేట కలెక్టరేట్‌లో అధికారులతో పరిచయ సమావేశం తప్ప మరో సమావేశం ఆయన నిర్వహించలేదు. ఇక ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ జిల్లా అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సమయంలో సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో మాత్రమే ఆమె పాల్గొన్నారు. ఆ తర్వాత ఆమె జిల్లాకు రాలేదు. సమస్యలు పరిష్కరించడం, అభివృద్ధికి కృషిచేయాల్సిన మంత్రులే ఇలా ఉంటే పాలన ఎలా ఉం టుందో అర్థం చేసుకోవచ్చు. మరో పది పదిహేను రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికల కోడ్ వస్తే అన్ని పనులు ఆగిపోయే అవకాశం ఉంది.

### సమస్యలపై పట్టింపేదీ?

జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మార్చి 7కి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు అవుతుంది. కానీ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ సమీక్షా సమావేశాలు నిర్వహించి యంత్రాంగానికి దిశానిర్దేశం చేయకపోవడంతో పాలన పడకేసింది. సమస్యలు పరిష్కారం కాకపోవడం, అభివృద్ధి పనులు కుంటుపడడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాసంగి రైతుబంధు డబ్బులు ఇంకా పూర్తిస్థాయిలో రైతులకు అందలేదు. రైతులు వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు సాగుచేసుకున్నారు. ఆసరా పింఛన్లు సరిగ్గా ఇవ్వడపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దవాఖానలు, మున్సిపాలిటీలు, పలు ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు అందక ఆందోళన చేస్తున్నారు.





ఇటీవల చేర్యాలలో పోలీసుల దాడుల్లో పట్టుబడిన గంజాయి చాక్లెట్ల ప్యాకెట్

### విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు

గ్రామాల్లో గంజాయి విచ్చలవిడిగా అమ్ముతున్నా సంబంధిత అధికారుల చర్యలు కరువయ్యాయి. పాన్‌డబ్బాలు, కిరాణా, జనరల్ స్టోర్స్‌లో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నారు. వీటికి యువత బానిసలవుతున్నారు. ఇసుక మాఫియా పేట్రేగిపోతున్నది. అరికట్టాల్సిన వారే వారికి వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. అధికారులు సమస్యలపై దృష్టిసారించడం లేదని, చుట్టపు చూపుగా గ్రామాలకు వచ్చి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి, నర్సరీల్లో మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇలా ఎన్నో సమస్యలు జిల్లాలో నెలకొన్నాయి. అసలు పాలన ఉందా? ప్రభుత్వం నడుస్తున్నదా? అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. ఇప్పటికైనా జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి సమీక్షలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### అనధికార కరెంట్ కోతలు షురూ...

అనధికార కరెంట్ కోతలు ఇప్పుడే రైతులకు ఇబ్బందులను గురిచేస్తున్నాయి. తరుచూ కరెంట్ ట్రిప్‌తో మోటర్లు కాలుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల ద్వారా గోదావరి జలాలు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటి పోతుండడంతో పంటలను కాపాడుకోవడానికి రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు మొదలయ్యాయి. పదేండ్లలో ఎన్నడూ తాగునీటి సమస్యలపై ధర్నాలు, ఆందోళనలు జరగలేదు.ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారులో ఆ పరిస్థితి నెలకొంది. వారం రోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయి. ఇప్పటికే ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. మార్చిలో పదోతరగతి పరీక్షలు జరుగుతాయి. పరీక్షల నిర్వహణ, సన్నద్ధతపై మంత్రులు కనీసం సమీక్ష చేయలేదు. జిల్లాలో విద్యాశాఖ సైతం పూర్తి నిర్లిప్తతగా ఉంది. విద్యార్థులకు స్నాక్స్ సరిగా అందడం లేదు.



అక్కన్నపేట: గొల్లకుంటలో ఎండిపోయిన మక్కజొన్న చేను

# ఎండుతున్న పంట చేన్లు

- తగ్గిన భూగర్భ జలాలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- కేసీఆర్‌ను యాది చేసుకుంటున్న రైతులు

అక్కన్నపేట, ఫిబ్రవరి 20: కేసీఆర్ సారు కడుపు సల్లగుండ...ఆయన ఏలినన్ని రోజులు కరువు లేకుండే. పోయిన ఏడు గీదినం(యాసంగి)లో చెరువులు, కుంటల్లో నీళ్లు ఉండేవి. అసొంటిది ఇప్పుడు నీళ్లు లేకుండా పోయినయి. పెట్టుబడి పెట్టి వరి, మక్క చేన్లు ఏస్తే కాలం పోయింది. బోర్లు, బావుల్లో నీళ్లు అడుగున పడ్డయి. కరెంటు ఇచ్చినట్లే ఇస్తుర్రు.. వస్తాంది, పోతాంది.. పొలాలు పారుతలేవు. వరుస తడులతోనైనా వరిచేన్లు బతికి బయట పడేటట్లు లేవు. ఎనకటి కాలం యాదికి అస్తున్నది.. అంటూ సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని పెద్దతండాకు చెందిన రైతు గుగులోతు రాములు ఆవేదన ఇది. ఒక్క రైతు రాములే కాదు, రైతులందరూ కేసీఆర్‌ను యాది చేసుకుంటున్నారు. ఆయన పాలన గుర్తుచేసుకుంటున్నరు. అక్కన్నపేట మండల వ్యాప్తంగా భూగర్భ జలాలు అడుగంటి పంట చేన్లు ఎండిపోతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



అక్కన్నపేటలో అడుగంటిన వ్యవసాయ బావి

### మండలంలో కరువు ప్రతిబింబించేలా...

మండల కేంద్రమైన అక్కన్నపేటతో పాటు, అంతకపేట, కట్కూరు, పంతుల్‌తండా, మోత్కులపల్లి, రామవరం, నందారం, గండిపల్లి, ధర్మారం, జనగామ, పోతారం(జే), కపూర్‌నాయక్‌తండా, పెద్దతండా, చాపగాని తండా, కేశనాయక్‌తండా, దుబ్బతండా, చౌటపల్లి, మల్లంపల్లి, కుందన్‌వానిపల్లి, మైసమ్మవాగుతండా గ్రామ పంచాయతీల పరిధిలో కరువును ప్రతిబింబించేలా పరిస్థితులు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలోని చెరువులు, కుంటల్లో నీళ్లు అడుగంటిపోతున్నాయి. బావులు, బోర్లను నమ్ముకొని పంటలు సాగు చేసిన రైతులు కండ్ల ముందే ఎండిపోతున్న పంటలను చూసి కన్నీళ్లు పెడుతున్నారు. నీరందక వరి, మక్క చేన్లు ఎండిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే పంటలు ఎండిపోయాయి. కొందరు రైతులు బోర్లు వేసేందుకు సిద్ధపడుతుండగా, మరికొందరు రైతులు వ్యవసాయ బావుల్లో క్రేన్ల ద్వారా పూడికతీత పనులు మొదలు పెట్టారు.



బోదర్‌వాగుతండాలో బోర్‌వేయిస్తున్న రైతు

### మూడెకరాల్లో పంటలు ఎండాయి..



నాకున్న మూడెకరాల్లో ఎకరం మక్క, రెండెకరాల్లో వరి వేసిన. మొత్తం చేను ఎండిపోయింది. రెండు పాలిచ్చే ఆవులను మేపుతున్న. వరి సన్నపొట్టకు వచ్చింది. ఒక్కసారిగా బోర్ బంద్ అయ్యింది. ఏం చేయాలో అర్థం కాలేదు. కండ్ల ముందే పంట చేన్లు ఎండిపోయే కాలం వచ్చింది. బతుకుదెరువు కోసం మళ్ల దేశాలు పోయేటట్టు పరిస్థితులు ఉన్నాయి. చుట్టుపక్కల వాళ్ల పరిస్థితి కూడా గట్లానే ఉంది.

-ఇట్టబోయిన కరుణాకర్, యువ రైతు, అక్కన్నపేట

### నీళ్లు అడుగంటినయ్..



గింత తొందరగా నీళ్లు అడుగున పడుతాయ్ అనుకోలేదు. పుష్కలంగా ఉండే నీళ్లు యాడికి పోయినయో తెలియకుంటా అయ్యింది. ముందుగా వరినాట్లు వేస్తే వరికి రోగాలు వచ్చి మందులు కొట్టి ఇగ వరి చేన్లు కొలుకుంటాయనే లోపే నీటి ఎద్దడి మొదలైంది. అటో, ఇటో నడి ఎండాకాలం వరకు పొలాలు పారేది. అసొంటిది గిప్పుడే నీళ్లు అడుగుకుపోయినై. పెట్టుబడికి మునిగి, పంట ఎండిపోయి ఆగమయ్యే కథ మొదలైంది. దేవుడు కనుకరిస్తే తప్పా పంటలు బతికే పరిస్థితి లేదు.

-భూక్య రాజాలు, చెర్వుముందు తండా, కేశనాయక్ తండా



కర్చల్‌లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- రాయికోడ్ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రాయికోడ్, జనవరి 20: గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సింగితం, బొగులంపల్లి, కర్చల్, యూసుపూర్, ధర్మాపూర్, రాయికోడ్, అల్లాపూర్, రాయికోడ్ ఎక్స్ రోడ్డులలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ, శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాయికోడ్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఇరిగేషన్ ఎస్ఈ మురళీధర్, సీఈవో జానకీ రెడ్డి, డీఎంహెచ్‌వో గాయత్రి, ఆర్‌డీవో రాజు, మండల ప్రత్యేకాధికారి జగదీశ్, ఎంపీపీ మమతాఅశోక్‌కుమార్, జడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఏఈలు శశికుమార్, జానకీ రామ్, ముక్రిద్, మాజీ జడ్పీటీసీ అంజయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ ఏసయ్య, ఎంపీటీసీ మొగులప్ప, నాయకులు సతీశ్ పంతులు, కేదారినాథ్ పాటిల్, ప్రభుచారి, నర్సింహులు ఉన్నారు.

# కంప్యూటర్ ల్యాబ్ సిద్ధం

## రూ.50 లక్షలతో బాలికల పాఠశాలలో ఏర్పాటు

- నేడు ప్రారంభించనున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- పేద విద్యార్థులకు చేరువకానున్న డిజిటల్ విద్యాబోధన

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 20: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో సిద్దిపేట నియోజకవర్గం విద్యారంగంలో విరాజిల్లుతుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు చొరవ.. నాట్కో సౌజన్యంతో ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలను డిజిటల్ బోధన, కంప్యూటర్ ల్యాబ్‌తో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. అదే తరహాలో మల్టీపర్పస్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూళ్లను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం గర్ల్స్ హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ బోధన కోసం 8 క్లాస్‌రూమ్‌లలో 8 స్క్రీన్లు ఏర్పాటు చేశారు. పనులు పూర్తయినందున బుధవారం మాజీ మంత్రి హరీశ్‌రావు వీటిని ప్రారంభించనున్నారు.

### సాంకేతిక విద్యకు ప్రోత్సాహం..

విద్యార్థుల మేధస్సును పెంచేలా ఇప్పటి నుంచే సాంకేతిక విద్యను ప్రోత్సహించేందుకు ఈ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడనున్నది. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ సహకారం, రూ.50 లక్షల సీఎస్ఆర్ నిధులతో 21 కంప్యూటర్లను ల్యాబ్‌లో ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్ మాధ్యమంగా పాఠాలు నేర్చుకునేలా ఎనిమిది క్లాస్ రూమ్‌లలో 8 డిజిటల్ స్క్రీన్‌లు అమర్చారు. తమ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తూ కంప్యూటర్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.




ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించనున్న కంప్యూటర్ ల్యాబ్

## 'మల్లన్న' ఆదాయం రూ.56,03,330

చేర్యాల, ఫిబ్రవరి 20: కొమురవెల్లి మల్లికార్జున స్వామి 5వ ఆదివారం సందర్భంగా రూ.56,03,330 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం తదితర వాటి ద్వారా శనివారం రూ.3,88,620, ఆదివారం రూ. 35,93,622, సోమవారం రూ. 16,21,088 ఆదాయం సమకూరిందన్నారు. ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గు పూజారులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.



చేర్యాలలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధిస్తాం

## జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 20: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు వివక్ష చూపిస్తే ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని వీరభద్ర ఫంక్షన్ హాలులో మంగళవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ప్రజలకు అందాల్సిన పథకాలు, కార్యక్రమాలను అధికార పార్టీ మార్చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. అధికారులు ఎలాంటి వివక్ష, నిర్లక్ష్యం చూపించినా తన దృష్టికి తీసుకురావాలని, ఎక్కడికక్కడ ప్రశ్నించాలన్నారు. నియోజకవర్గంలో ఏ సమస్యలున్నా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించానని, త్వరలోనే కోరిక నెరవేరుతుందని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, పార్టీ మండల, టౌన్ అధ్యక్షులు అనంతుల మల్లేశం, మేక సంతోశ్, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ మంగోలు చంటి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, గోనే హరి, మంచాల కొండయ్య, తలారి కిషన్, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, మండల మహిళా అధ్యక్షురాలు మీస పార్వతి, రాష్ట్ర నాయకురాలు పచ్చిమడ్ల మానస, ముత్యం నర్సింహులు, గొల్లపల్లి కిష్టయ్య, బొంగు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టులను పరామర్శించిన ఎమ్మెల్యే

మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన జర్నలిస్టు అనుముల నర్సిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఎమ్మెల్యే పల్లా ఆయనను పరామర్శించారు. అనంతరం కొద్ది రోజుల క్రితం షెటిల్ కోర్టులో జారిపడి గాయపడిన చేర్యాల పట్టణానికి చెందిన జర్నలిస్టు ఒరుగంటి శ్రీకాంత్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.



మెదక్‌లో జిల్లా సహకార శాఖ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణలో టీఎన్జీవో నాయకులు

# సహకార ఉద్యోగుల సేవలు భేష్

- టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించడంలో జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సేవలు అభినందనీయమని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అన్నారు. మంగళవారం మెదక్‌లోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ధాన్యం సేకరణతో పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి, మత్స్యకారులు, గొర్రెల పెంపకందారులు, పాల ఉత్పత్తిదారులు, గీత పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికల వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తూ.. అటు అధికారులు, ఇటు ప్రజల మన్ననలు పొందిన ఘనత సహకార శాఖ ఉద్యోగులకే దక్కుతుందన్నారు. అనంతరం సహకార శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామగౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, జిల్లా సహకార శాఖ అధికారి కరుణతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, మాజీ అధ్యక్షుడు శ్యామ్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్, సహకారశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సంగమేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, ఉద్యోగులు యాకూబ్‌అలీ, భరత్ కృష్ణ, పూర్ణచందర్, రాజేశ్, తుకారం పాల్గొన్నారు.

# తొడకొట్టి.. కుస్తీపట్టి

## పీర్‌గైబ్ సాహెబ్ ఉర్సులో అంతర్రాష్ట్ర పోటీలు



న్యాల్‌కల్ పీర్‌గైబ్ సాహెబ్ ఉర్సులో తలపడుతున్న మల్లయోధులు

- తిలకించేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు
- ఫైనల్ విజేతకు రూ. 20,051వేల నగదు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 20: మండల కేంద్రం శివారులోని షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ ఖిల్లా దర్గా ఉర్సులో భాగంగా మంగళవారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. డప్పుచప్పుళ్లు, ప్రేక్షకుల ఈలలు, కేరింతల మధ్య మల్లయోధులు నువ్వానేనా అన్న రీతిలో తలపడ్డారు. పెద్దవాళ్లతో పాటు చిన్నారులు, యువకుల మధ్య జరిగిన పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ స్థాయిల్లో గెలుపొందిన విజేతలకు వెండి కడియాలతో పాటు రూ.100 నుంచి రూ. 20వేల వరకు అందజేశారు. ఫైనల్లో మహారాష్ట్ర కోలాపూర్‌కు చెందిన మల్లయోధుడు లింగరాజ్ అదే ప్రాంతంలోని లాతూర్‌కు చెందిన బహుమని ముగ్దర్ పోటీ పడగా, లింగరాజ్ విజేతగా నిలిచాడు. బీఆర్ఎస్ మండల మైనార్టీ సెల్ నాయకుడు సయ్యద్ షకీల్ హైమద్ లింగరాజ్‌కు రూ. 20,051 వేల నగదును అందజేసి ఘనంగా సత్కరించారు. ఎక్కడా గొడవలు జరుగకుండా ఉర్సు నిర్వాహకులు, హద్నూర పోలీసులు పకడ్బందీగా బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఉర్సు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యూనూస్‌ఖాన్, పార్టీ మండల నాయకులు బస్వరాజ్, పడకంటి వెంకట్, భద్రుస్వామి, నర్సింహులు, జగన్నాథ్, వాహబ్, మైబుబ్, మక్సూద్, ఇస్లాంపటేల్ తదితరులు పాల్గొన్నారు.



పీర్‌గైబ్ సాహెబ్ దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు